పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం


గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో సీడీపీఓ ఉదయశ్రీ

కీసర: పిల్లలు, యుక్తవయస్కులు మహిళల పోషకాహార స్థితిని మెరుగు పరిచేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ మేడ్చల్ సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. కీసర దాయరలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 రోజులుగా నిర్వహించిన వేడుకల్లో పోషకాహారం, ఆహార పద్ధతులు, మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గర్భిణులు మహిళలకు సీమంతం నిర్వహించారు. మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ యశోద, అంజమ్మ, ఏఎన్‌ఎం రాణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం షాపూర్‌నగర్‌కు చెందిన ఆశిష్(28) శుక్రవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై గండిమైసమ్మ నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా మార్గమధ్యలోని మండలంలోని గౌడవెల్లి చౌరస్తా వద్దకు చేరుకోగా అదే సమయంలో మేడ్చల్ వైపు నుంచి వస్తున్న డీసీఎం ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆశిష్ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కేబుల్ గోదాంలో చోరీ

ఘట్‌కేసర్: కేబుల్ గోదాంలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. అడిషనల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్‌లోని ఓ కేబుల్ గోదాంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు సుమారు రూ.7.5 లక్షలు విలువ చేసే నాలుగు కేబుల్ బండిళ్లను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న గోదాం ఇన్‌చార్జ్ నరేందర్‌సింగ్ వాచ్‌మెన్‌ను విచారించిన చోరీ విషయం తెలియరాలేదు. దీంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'రాగిడి' గెలుపు కోసం కృషి చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు ఎమ్మెల్యే స్థానాలనూ బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుందని గుర్తుచేశారు. అదే ఉత్సాహంతో పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ పేద, మధ్య తరగతి ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉండి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ చీరాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాల లక్ష్మీసాయి గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్ శుక్రవారం తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి హాజరు కానున్నట్టు చెప్పారు. డివిజన్ పరిధిలోని 42 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బూత్ ఏజెంట్స్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాలు హాజరుకావాలని కోరారు.

స్వయం ఉపాధిలో రాణిస్తున్న మహిళలు

- నిర్ధేశించిన లక్ష్యాన్ని అధిగమించి రూ.185.15 కోట్ల రుణాల అందజేత
- స్త్రీనిధి కింద 82శాతం రుణాలు.. నెలాఖరు వరకు వంద శాతానికి చర్యలు
- వడ్డీ బకాయిల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయంతో సంఘాల్లో ఉత్సాహం

బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రుణ లక్ష్యం రూ.164.20 కోట్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన సభ్యులు వివిధ రకాల కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు చేస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా 2,703 మహిళా సంఘాలకు రూ.164.20 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకు లక్ష్యాన్ని అధిగమించి రూ.185.15 కోట్ల రుణాలు మంజూరు చేశారు. జిల్లాలో 113 శాతం రుణ లక్ష్యాన్ని అధిగమించారు. మరో 8 రోజుల్లో రూ.2 కోట్ల మేరకు రుణాలు అందజేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 113 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలో మొదటి నుంచి ఐదు స్థానాల్లోపు ర్యాంకు సాధించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెలాఖరు వరకు మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందజేసి.. గతంలో మాదిరిగా రాష్ట్రం మొదటి స్థానాన్ని సాధించడానికి ప్రయత్నిస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పేర్కొంటోంది.

అందజేత ఇలా..

జిల్లాలో మొత్తం 3,383 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 36,553 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరానికి అధికారులు 2,703 సంఘాలకు గాను రూ.164.20 కోట్లు మంజూరు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయగా, ఇప్పటి వరకు 2,703 సంఘాలకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రూ.185.15 కోట్ల రుణాలు అందజేశారు. జిల్లాలోని ఘట్‌కేసర్ మండల పరిధిలో 636 సంఘాలకు, కీసర మండలంలో 559 సంఘాలకు, మేడ్చల్ మండలంలో 526 సంఘాలకు, ఎంసీపల్లిలో 487 సంఘాలకు, శామీర్‌పేట మండలంలో 495 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశారు. ఈ సంఘాలకు నిర్దేశించిన లక్ష్యం కంటే 13 శాతం రుణాలు మంజూరు చేశారు.

స్త్రీనిధి రుణాలిలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్త్రీనిధి కింద మహిళా సంఘాల కుటుంబ సభ్యుల అవసరాల నిమిత్తం రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం, పిల్లల చదువు, ఆరోగ్యం, ఇతర చిన్న, చిన్న ఉపాధి వ్యాపారాలకు ఈ రుణాలను మహిళా సంఘాలు వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్త్రీనిధి కింద జిల్లాలో రూ.15 కోట్ల రుణాలు అందజేయాలని లక్ష్యంగా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్దేశించుకున్నా.., ఇప్పటి వరకు 752 మహిళా సంఘాలకు రూ.12.13 కోట్లు(82శాతం) రుణాలను పంపిణీ చేశారు. మిగిలిపోయిన రుణాలను కూడా ఈ నెలాఖరుకల్లా అందజేసేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేయడానికి చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు కూడా చెల్లించడానికి నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా జిల్లాలోని సంఘాలకు త్వరలోనే వడ్డీ బకాయిలు బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయి. సంఘాల సభ్యులకు రూ.5 లక్షల బీమా కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు రావాల్సి ఉందని డీఆర్డీవో శాఖ అధికారులు చెబుతున్నారు.

బ్యాంకు లింకేజీ అధిగమించాం..



జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 113 శాతం రుణాలు అందజేశాం. ఈ నెలాఖరుకల్లా మరిన్ని రుణాలు అందజేసి, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తాం. అలాగే, స్త్రీనిధి కింద 82 శాతం రుణాలు అందజేశాం. ఈ నెలాఖరు వరకు వందశాతాన్ని అధిగమిస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెలా క్రమం తప్పకుండా కిస్తులు చెల్లించాలి.

– సాంబశివరావు, జిల్లా అధికారి, గ్రామీణ అభివృద్ధి సంస్థ, మేడ్చల్ జిల్లా.

విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీసేందుకు..



ముఖ్యఅతిథి ప్రొఫెసర్ కృష్ణ వేదులతో కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా, అధ్యాపకులు

ఘట్‌కేసర్: విద్యార్థుల్లోని సృజనాత్మకత టెక్ ఫెస్ట్ వెలికితీస్తుందని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి నల్లా మల్లారెడ్డి అన్నారు. కాచవాని సింగారం దివ్యానగర్ నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ అటానామస్ క్యాంపస్‌లో రెండు రోజులు నిర్వహించిన టెక్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా పేపర్, పోస్టర్, ఐడియా ప్రెజెంటేషన్, డిబేట్, క్విజ్ అంశాల్లో పోటీ నిర్వహించారు. విద్యార్థులు వర్షం నీటిని తాగునీటిగా మార్చడం, ప్లాస్టిక్ రోడ్డు నిర్మాణం, రోబో రూపకల్పన, సౌరశక్తితో అగ్నిమాపక యంత్రం, వ్యర్థాల ద్వారా విద్యుత్, స్మార్ట్ డస్ట్‌బిన్లు డిజైన్ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కృష్ణవేదుల హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే దిశగా విద్యార్థులు కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా, ప్రిన్సిపల్ ఎంఎస్ వీ.రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి


మాట్లాడుతున్న సాయిసతీశ్

ఘట్‌కేసర్: విద్యార్థులు సాంకేతికతను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్‌'పై కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతకు సమాంతరంగా ముందుకు సాగడానికి క్రమశిక్షణ, సమయపాలన అవసరం అన్నారు. సదస్సుకు హైదరాబాద్‌లోని వివిధ సంస్థల నుంచి 160 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్ కుమార్, డీన్ సాయి సతీశ్, కన్వీనర్ మల్లికార్జున్‌రెడ్డి, కో కన్వీనర్లు మనోరంజన్ దాష్, అర్చన, ఫాకల్టీ కోఆర్డినేటర్ రాజేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామెడ్‌కె యుజెట్ ప్రవేశ పరీక్ష మే 12న..

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు 150కిపైగా ఇంజినీరింగ్ కళాశాలల్లో, 50కిపైగా పేరొందిన ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీల్లో ప్రవేశం అందించేదిగా దేశవ్యాప్తంగా పేరొందిన కామెడ్‌కె యుజెట్, యునిగాజ్ ప్రవేశ పరీక్ష మే 12వ తేదీన జరుగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బీఇ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశం కల్పించే ఈ ఆన్‌లైన్ పరీక్ష 200కిపైగా నగరాల వ్యాప్తంగా జరుగుతుందని, లక్షకు పైగా అభ్యర్థులు హాజరవుతారని వివరించారు. పరీక్షకు హాజరయ్యే నగరానికి చెందిన విద్యార్థులు www.comedk.org/www.unigauge.comలో పేర్ల నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5వరకూ గడువు ఉందని తెలియజేశారు.

లక్ష్మీనారాయణ నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

రామంతాపూర్: ఉప్పల్ డివిజన్ పారిశ్రామికవాడ పరిధిలోని లక్ష్మీనారాయణ నగర్‌లో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణ నగర్‌లో కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన అన్నారు.

రేపు ముత్యాలరావు సొసైటీ కార్యవర్గ సమావేశం

అల్వాల్: నేరేడ్‌మెట్ ముత్యాలరావు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం రేపు(ఆదివారం) నిర్వహించనున్నట్టు సొసైటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నేరేడ్‌మెట్‌లో మహాబోధి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:30కు సమావేశం ప్రారంభమవుతుంది.

జవహర్‌నగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధి పనులు, సమస్యల గురించి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో జీవో–58, 59 పూర్తిస్థాయిలో అమలు కాలేదని, పేద ప్రజలు జీవో–59 కింద అధిక రుసుం చెల్లించలేకపోయారని, మరోసారి జీవో–58, 59 అమలు చేసి పేదలకు పూర్తిస్థాయి యాజమాన్యపు హక్కులు కల్పించాలని కోరారు. అదేవిధంగా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో జనాభాకు అనుగుణంగా 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి కేటాయించాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు జవహర్‌నగర్‌లో ఉన్నారని వారికి సరైన క్రీడా మైదానాలు లేకపోవడంతో ఆటలకు దూరమవుతున్నారని క్రీడా మైదానాలు కేటాయించాలని కోరారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా డంపింగ్‌యార్డు దుర్వాసన రాకుండా చేస్తున్నామని, త్వరలోనే పరిష్కారం చూపిస్తామన్నారు.

సాధనతోనే విజయం తథ్యం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి, బాలారెడ్డి

మేడ్చల్‌రూరల్: క్రీడలు, చదువుల్లో సాధనతోనే విజయం వరిస్తుందని నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌ఆర్‌ఐటీ అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రోజమ్మ మెమోరియల్ పేరిట నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్ రెడ్డి, సెయింట్ పీటర్స్ కళాశాల చైర్మన్ బాలారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఏ ఆటలోనైనా ప్రాక్టీస్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు అకాడమిక్ సర్టిఫికెట్‌తో పాటు స్పోర్ట్స్ సర్టిఫికెట్ కూడా పొందాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చి రాణించాలని కోరారు. కళాశాల సెక్రటరి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో మానసిక బుద్ధి వికాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. మర్రి లక్ష్మణ్ రెడ్డి స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి అథ్లెటిక్స్‌లో పాల్గొనడం వల్ల 81 ఏళ్ల వయస్సులోనూ ఫిట్‌గా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, పీడీ రత్నకుమార్, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకునేందుకు తమవంతు కృషిగా మేడ్చల్ ఉమ్మడి మండల బీజేపీ నాయకులు కృషి చేయాలని ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మండలం, మేడ్చల్ మున్సిపాలిటీ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాయకులతో మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ మండలం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు అధిక మెజార్టీ వచ్చేలా నాయకులు కార్యకర్తలతో కలిసి పనిచేయాలని అన్నారు. ఎన్నికల రోజు వరకు తమ సమయాన్ని పూర్తిగా పార్టీకి కేటాయించి, బీజేపీ అభ్యర్థికి ఓటు వేసేలా ఓటర్లను చైతన్యపర్చాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్ రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణగౌడ్, హేమలత, కౌన్సిలర్లు సరస్వతి, హంస తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి


వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర అన్నారు. నెలనెలా వేతనాలు చెల్లించాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆ ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులకు కాంట్రాక్టర్ సాయి సెక్యూరిటీ యాజమాన్యం వేతనాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఆర్జిత సెలవులు ఇవ్వాలని, లేని పక్షంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు భాగమ్మ, శివమ్మ, నాగమ్మ, పుష్ప, బాలమణి, కృష్ణ, రవి, సత్యనారాయణ, లక్ష్మీ, ప్రేమమ్మ, ఊర్మిల, ఇందిర, ప్రేమలత, లూథియా, శ్వేత, విమల, హెహరున్నీస పాల్గొన్నారు.

బీజేపీవైపు.. బీఆర్‌ఎస్ నేతల చూపు..

- బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తున్న సీనియర్లు
- బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం
- మండల సీనియర్ నేతలు అటువైపే..
- ఇంటింటికీ వెళ్లి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

మేడ్చల్: ఒకనాడు టీడీపీలో, కాంగ్రెస్‌లో ఉండి మేడ్చల్ మండల రాజకీయాలను శాసించిన బడా రాజకీయ నాయకులు అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి రాజకీయాలు చేశారు. ప్రస్తుతం వారు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యవహార శైలి నచ్చకున్నా అధికారంలో ఉన్నన్ని రోజులు అందులో ఉండి తాజాగా అవకాశం రావడంతో బీజేపీలో చేరడానికి ఆ పార్టీ అగ్ర నాయకుడు ఈటల రాజేందర్ స్వయంగా వారి వద్దకు వచ్చి ఆహ్వానాలు పలుకుతుండటంతో తమ పూర్వ వైభవం కోసం అడుగులు వేస్తున్నారు. అధిక మంది రాజకీయ నాయకులు టీడీపీలో పుట్టి పెరిగిన వారు కొందరూ ఉండగా, మరి కొందరు కాంగ్రెస్ నుంచి వచ్చిన వారు ఉన్నారు. బీఆర్‌ఎస్ గాలిలో తమ రాజకీయ జీవితం కనుమరుగవుతుందనే భయంతో కొంతమంది బీఆర్‌ఎస్‌లో చేరగా మరి కొంతమంది స్తబ్దుగా ఉండిపోయారు. బీఆర్‌ఎస్‌లో చీత్కారాలకు గురైన వారు అధికారం కోసం అందులోనే ఉండిపోయారు. తాజాగా బీఆర్‌ఎస్ పతనం దిశగా నడవడం, కాంగ్రెస్ నాయకులు గుర్తించకపోవడంతో అదే సమయంలో బీజేపీ వారు అక్కున చేర్చుకునే యత్నాలు చేస్తున్నారు. దీంతో మండల సీనియర్ నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారు.

ఫలిస్తున్న ఈటల మంత్రాంగం..

ఈటల రాజేందర్ సీనియర్ నాయకుడు కావడం, లౌక్యం తెలిసిన నాయకుడు కావడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నేర్చుకున్న గుణపాఠాలతో ప్రతి ఓటు కోసం ఏ అవకాశాన్ని వదలడం లేదు. ఒకనాడు వెలుగు వెలిగి ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న నాయకులను, రాజకీయ సీనియర్లుగా ఉన్న వారిని ఆయన నేరుగా ఇంటికి వెళ్లి కలుస్తూ తనకు అండగా ఉండాలని, బీజేపీలో చేరాలని కోరుతున్నారు. తమను గుర్తించి ఇంటి వరకు వచ్చిన నాయకుడి కోసం అంటూ స్థానిక నేతలు ఆయన బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నేతల ఇళ్లకు వెళ్లడం, పాత రోజులను గుర్తు చేయడంతో ఆయన నడుపుతున్న మంత్రాంగాలు సఫలం అవుతున్నాయి.

క్యూ కడుతున్న నేతలు..

ఈటల రాజేందర్ మిత్రుడు పూడూర్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉంటూ చాలా రోజులుగా ఈటలకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయన పాత నాయకులను ఏకం చేస్తూ అందరినీ బీజేపీలో చేర్చేలా ముందుండి నడిపిస్తున్నారు. మేడ్చల్‌లో అత్యంత సీనియర్ నాయకుడు నారెడ్డి నందారెడ్డి, మరో నాయకుడు నర్సింహారెడ్డి, సీనియర్లు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సద్ది బలరాంరెడ్డి, మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా వంటి నాయకులు బీజేపీలో చేరడానికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. మండల ప్రధాన నాయకులతో పాటు అగ్ర నాయకుల అనుచర గణం బీజేపీలో శనివారం ఏర్పాటు చేసిన సభలో చేరతారని నాయకుడు నందారెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ మరి కొంతమంది కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

కామ్రేడ్ కిరణ్‌కు కన్నీటి నివాళి


- మూగబోయిన ప్రజా గొంతుక
- బడుగు, బలహీనవర్గాలపై ప్రత్యేక ముద్ర
- పెద్దఎత్తున హాజరైన ప్రజా సంఘాల నేతలు
- జవహర్‌నగర్‌లో ముగిసిన అంత్యక్రియలు


కిరణ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కామ్రేడ్ కిరణ్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: ప్రజల కోసం పరితపించే గొంతుక మూగబోయింది. నిత్యం ప్రజా సమస్యలను తన గొంతుతో గళమెత్తిన కామ్రేడ్ కిరణ్ దివికెగిసాడు. తన మాటలతో ప్రజా ఉద్యమాలకు ఊపు తెచ్చిన ఆ గొంతు శాశ్వతంగా మూగబోయింది. ఆటో డ్రైవర్ల హక్కుల కోసం పోరాడుతున్న ఆటో అండ్ మోటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ వి.కిరణ్ గురువారం సాయంత్రం అనారోగ్యంతో జవహర్‌నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు.

బతుకు దెరువుకోసం వలసవచ్చి..


కామ్రేడ్ కిరణ్ (ఫైల్)

నిజామాబాద్‌లోని సారాంగాపూర్ గ్రామానికి చెందిన కిరణ్ బతుకు దెరువు కోసం హైదరాబాద్ నగరానికి వలసవచ్చి జవహర్‌నగర్ ప్రగతినగర్‌లో జీవిస్తున్నాడు. కిరణ్‌కు భార్య ఒడ్లకొండ గంగమ్మ, కూతురు మహేశ్వరీ, కుమారుడు నరేష్ ఉన్నారు. చిన్నతనం నుంచి ప్రజల హక్కుల కోసం పోరాడే కిరణ్ 1997లో ఆటో యూనియన్ ప్రారంభించి ఆటోడ్రైవర్ల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారు. జవహర్‌నగర్‌లో నివసించే గుడిసెవాసులకు అండగా ఉండి ఎంతో మందికి గూడు కల్పించిన పోరాటయోధుడు. శుక్రవారం జవహర్‌నగర్‌లో ఎర్రజెండాలు, జోహార్ల నడుమ అంతిమయాత్ర కొనసాగింది. సాయంత్రం అంబేడ్కర్‌నగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలను నిర్వహించారు.

నివాళులర్పించిన ప్రజా సంఘాల నేతలు..

అనారోగ్యంతో మృతి చెందిన కిరణ్ మృతదేహానికి పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, సీపీఐ(ఎంఎల్) నాయకురాలు అనురాధ, ఐఎఫ్‌టీయూ నాయకుడు షేక్‌షావలీ, పీడీఎం నాయకులు చంద్రమౌళి, జాన్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలనర్సింహ, ఆటో యూనియన్ నాయకుడు అమానల్లాఖాన్, నరేందర్, రాజ్యలక్ష్మి, జయసుధ, ఎఐటీయూసీ రాష్ట్ర నాయకులు, పీడీఎం, సీపీఐ, సీపీఎం, రాష్ట్ర ఆటోయూనియన్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.